క్లుప్తంగా

పోషకాహారంతోనే ఆరోగ్యం



ఏన్కూరు: కోడిగుడ్లు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ

ఏన్కూరు/వేంసూరు: పోషకాహారంతోనే పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, మల్లీశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా జన్నారం అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం వెంకటమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు అందించారు. అదే విధంగా వేంసూరులోని వెంకటపురం సెక్టర్ పరిధిలోని లక్ష్మీనారయణపురం గ్రామంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



మున్సిపల్ చైర్ పర్సన్‌కు ఇంటి పన్ను బిల్లు అందజేస్తున్న ఆర్‌ఐ రాము

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు, పంపు బిల్లులు వసూలు కోసం శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత ఇంటి పన్ను చెల్లించగా ఆమెకు మున్సిపాలిటీ సిబ్బంది బిల్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

వైరా ఏడీఏగా కరుణశ్రీ



టి.కరుణశ్రీ

వైరా: వైరా వ్యవసాయ సహాయ సంచాలకురాలిగా టి.కరుణశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు. వైరా ఏడీఏ వి.బాబూరావు పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ కాగా.. ఖమ్మం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ సతీష్ ఇన్‌చార్జ్ ఏడీఏగా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తిస్థాయి ఏడీఏగా కరుణశ్రీ వైరా మార్కెట్ యార్డ్‌లో గల ఏడీఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ పరిధిలోని మండలాల ఏఓలు, ఏఈఓలు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీకాలతో రక్షణ

తల్లాడ: నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భాస్కర్, పెద్దపుల్లయ్య, మేరమ్మ, వసంతకుమారి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూఎస్‌ఏలో పీజీ సీటు సాధించిన సంధ్య



సంధ్య లక్కిరెడ్డి

మధిర: మధిర పట్టణానికి చెందిన లక్కిరెడ్డి సుధాకర్ రెడ్డి కుమార్తె డాక్టర్ సంధ్య అమెరికాలోని సౌత్ జార్జియా మెడికల్ సెంటర్‌లో ఇంటర్నల్ మెడిసిన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ సాధించారు. ఈ సందర్భంగా సంధ్యకు ప్రముఖ కార్డియాలజిస్ట్ లకిరెడ్డి హనిమిరెడ్డి, డాక్టర్ కుడుముల వెంకటరావిరెడ్డి, భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, మధిర మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ విద్యాలత తదితరులు అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

ముదిగొండ: మండలంలోని గంధసిరి, చిరుమర్రి గ్రామాల్లో శనివారం ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ముదిగొండ ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాలలో స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు కేంద్ర భద్రతా బలగాలతో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్ కవాతు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

పెనుబల్లి: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని, కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రూ.600 వేతనం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కుప్పెనకుంట్లలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, శ్రీహరి, మరియమ్మ, రాజేశ్వరి, కృష్ణవేణి, రాధా తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం

- మండలంలో 18 కేంద్రాల ఏర్పాటు
- రేపటి నుంచి 30 వరకు పరీక్షలు
- హాజరుకానున్న 3,162 మంది విద్యార్థులు



ఎన్టీఆర్‌నగర్ హైస్కూల్‌లో పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వాహణకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సత్తుపల్లి నియోజకవర్గంలో టెన్త్ పరీక్షలకు 18 పరీక్షా కేంద్రాల్లో 3,162 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇప్పటికే పరీక్షా పత్రాలు మండల కేంద్రాల్లోని పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ప్రశ్నాపత్రాలు ఉన్న పెట్టెలను అధికారులు సీల్ వేసి భద్రపరిచారు.

రేపటి నుంచి పరీక్షలు..

టెన్త్ పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. గాలి, వెలుతూరు వచ్చేలా ఉండే గదులతో పాటు బెంచీలు, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు తదితర వసతులు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బందితో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులతో అందుబాటులో ఉంచనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా సీనియర్ ప్రధానోపాధ్యాయులను నియమించారు. జిల్లా ఫ్లెయింగ్ స్క్వాడ్‌తో పాటు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు..

విద్యార్థులు భయంవీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించారు. టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. టెన్త్ వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధిస్తున్నారు.

నిబంధనలు పాటించాలి..

పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. నిమిషం నిబంధన అమలులో లేదు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా అర గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో ఆరు పరీక్షా పేపర్లు ఉండేవి. ఈ ఏడాది ఫిజిక్స్, బయాలజీ ప్రత్యేక రోజుల్లో నిర్వహించనున్నారు. హిందీకి తప్పా మిగిలిన అన్ని సబ్జెక్టులకు మధ్యలో సెలవు వచ్చేలా పరీక్షల షెడ్యూల్ విడుదలైంది.

మండలం	విద్యార్థులు	పరీక్షా కేంద్రాలు
సత్తుపల్లి	1182	06
వేంసూరు	384	02
పెనుబల్లి	668	04
కల్లూరు	639	04
తల్లాడ	289	02

సబ్జెక్ట్స్	పరీక్షతేది
తెలుగు	18-03-2024
హిందీ	19-03-2024
ఇంగ్లీష్	21-03-2024
గణితం	23-03-2024
ఫిజిక్స్	26-03-2024
బయాలజీ	28-03-2024
సోషల్	30-03-2024

పరీక్షలకు అంతా సిద్ధం..



పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రాలను పరిశీలించి పరిసరాల పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఇన్విజిలేటర్లను నియమించాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలి.

– బి.రాములు, ఎంఈఓ, సత్తుపల్లి

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కొణిజర్ల: హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

కొణిజర్ల/చింతకాని: ఈ నెల 18 నుంచి జరిగే పది పరీక్షలకు కొణిజర్ల మండలంలోని జెడ్పీ పాఠశాల తనికెళ్ల, జెడ్పీహెచ్‌ఎస్ కొణిజర్ల, సింగరాయపాలెం పాఠశాలలతో పాటు సెయింట్ అలోషియస్ పాఠశాల తనికెళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాలలో మొత్తం 706 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. అదే విధంగా చింతకాని మండలంలోని 12 ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మూడు ప్రైవేట్ పాఠశాలలు, బోనకల్ మండలం ముష్టికుంట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిపి మొత్తం 469 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

144 సెక్షన్ అమలు..

పరీక్షా కేంద్రాలు ఉన్న గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎంఈఓ మోదుగు శ్యాంసన్ తెలిపారు. ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు మూసి వేయిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు కాగా విద్యార్థులను 45 నిమిషాలు ముందుగానే కేంద్రలోకి అనుమతించనున్నట్లు తెలిపారు. సమయం అయిపోయిన 5 నిమిషాల వరకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

తనికెళ్ల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం..



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయుడు భాస్కర్

కొణిజర్ల: మంచి విలువలతో కూడిన విద్య ఆర్థిక స్థితిగతులను మారుస్తుందని తనికెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.అబ్రహం, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ తాటిపల్లి సుధీర్ తెలిపారు. శనివారం తనికెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సం, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలలో ఈ ఏడాది ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన 8వ తరగతి బాలిక లక్ష్మీ విలాస్యకు స్థానిక ఉపాధ్యాయుడు గడల భాస్కర్ రూ.1,000 నగదు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం నాయకులు లేడిబోయిన గోపాలరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో..

వైరా: వైరా రవీంద్రనాద్ ఠాగూర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిద్ధార్థ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం శనివారం విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పీఓ లింగరావు, అధ్యాపకులు వేణు, మజీద్, రాము, చైతన్య, నరేంద్ర పాల్గొన్నారు.

సైనిక స్కూల్‌కు అర్హత సాధించిన విద్యార్థులు

తల్లాడ/కల్లూరు: ఈ నెల 14న ప్రకటించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తల్లాడలోని బాలభారతి విద్యాలయానికి చెందిన 5మంది విద్యార్థులు అర్హత సాధించారని కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈలప్రోలు జస్వంత్, చావా అక్షయ, కోసూరి అభినయ, తడికమల్ల గౌతమి లను ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, డైరెక్టర్ శ్రావణి, కేఎస్‌ఎం ప్రిన్సిపాల్ రామారావు, ఇన్‌చార్జ్ మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు. అదే విధంగా కల్లూరులోని బాలాజీ హైస్కూల్‌కు చెందిన 14 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ వలసాల బాలాజీ పేర్కొన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు ఎం శ్రీమాన్ దీపక్(239), ఆర్ సత్యబోధన్(220), టి.క్షేత్రజ్ఞ(215), సహర్షిత్(198)లతో పాటు మరో 11 మంది విద్యార్థులు ఆర్ శ్రీనరేష్, జి.జాహ్నవి, కె.శ్రీసాయి, తేజస్, కె.విజయవెంకట్, జె.సాయి చరణ్, జె.హర్షిత, కె.నిశాంత్, కె.చరణ్‌తేజ, ఎం.ప్రసన్న, అభినవ్‌లను ఎంఈఓ దామోదర ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన మండల పరిధిలోని వెంకిట్యాతండా గ్రామానికి చెందిన రైతు గుగులోత్ దేశ్యా కుటుంబానికి మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్, మంగళం కంపెనీ ఎండీ గుగులోత్ రాజేందర్‌నాయక్‌లు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. వీరితో పాటు, కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్ 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రప్రకాశ్, లంబాడీల ఐక్యవేదిక జిల్లా ఇన్‌చార్జ్ బాలునాయక్, భాస్కర్‌నాయక్, జగన్ పాల్గొన్నారు.

మిస్ట్‌లో ప్రథమ చికిత్సపై అవగాహన

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జాన్‌అంబులెన్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సహకారంతో మైనింగ్ విద్యార్థులకు సింగరేణిలో జరిగే ప్రమాదాలకు అందించే ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ విధానం, బ్యాండేజ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, డాక్టర్ కృష్ణ, ట్రైనర్ శ్రీనివాసరావు, డీన్ జాకీర్‌హుస్సేన్, మైనింగ్ విభాగాధిపతి రాఘవరాజు పాల్గొన్నారు.

నియామకం

కారేపల్లి: వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కారేపల్లి గ్రామానికి చెందిన షేక్ గౌసుద్దీన్‌ను శనివారం నియమించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ మదన్‌లాల్ నుంచి నియామక పత్రాలు పొందారు.

పశువైద్య శిబిరం విజయవంతం

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు, రఘునాధగూడెం గ్రామ పంచాయతీలలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కల్లూరు మండల పశువైద్యాధికారి మమత చెన్నూరు, రఘునాధగూడెంలలో 1,215 పశువులకు టీకాలు వేశారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య ఆధ్వర్యాన విద్యార్థులు నామినేషన్ల దాఖలు, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కు ఓట్ల లెక్కింపు, గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీరణ పత్రం జారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలోని టౌన్-2 ఫీడర్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున గాంధీనగర్, ద్వారకాపురి కాలనీ, పోస్టాఫీస్‌రోడ్, లలితకుమారిఆస్పత్రిరోడ్, జూపల్లి కంటిఆస్పత్రిరోడ్, కల్పతరురోడ్, మహాత్మాగాంధీరోడ్, రామాలయం రోడ్, అవనీ వెంచర్‌లలో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేట, ఏన్కూరు, నాచారం సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం 33కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విదుత్ కోత విధిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఉమాకాంత్ శనివారం ఒక ప్రకటలో తెలిపారు.

పొట్టి శ్రీరాములు జయంతి

మధిర: మధిర శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్లపోతు ప్రసాదరావు, కృష్ణారావు, జగదీష్, మల్లికార్జున రావు, నరసింహారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కారేపల్లి: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్ అన్నారు. శనివారం కారేపల్లిలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఘట్టం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా భట్టికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వీరప్రతాప్, సురేందర్ మనియార్, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, గోపాల్ నాయక్, భీముడు, సట్టి వీరభద్రం, చాంద్‌పాషా, జానీ, తురక అనీల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఏన్కూరు: గ్రామ పంచాయతీ వర్కర్స్ పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు ఎంపీఓ సత్యనారాయణకు శనివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్లు ముత్యాలరావు, నెల్లూరు బిక్షమయ్య, నర్సింహారావు, ఉమ్మడి కొండ మేడి రాములు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి

మధిరరూరల్: కేసుల్లో రాజీ మార్గమే రాజమార్గం అని మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం మధిర కోర్టులో 1,045 కేసులను పరిష్కరించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 81 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా.. రూ.1,44,100 జరిమానా విధించారు. 2 సివిల్ కేసులు రాజీ అయ్యాయి. అదేవిధంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 129 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా రూ.1.20లక్షలు జరిమానా విధించారు. 6 సివిల్ కేసులు పరిష్కారం అయ్యాయి. అదేవిధంగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అబ్రహం ఆధ్వర్యంలో జరిగిన లోకదాలత్ బెంచ్‌లో 527 కేసులు పరిష్కారం కాగా రూ.55,350 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు నాగలక్ష్మి, భద్రయ్య, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిలోని సబ్‌కోర్టులో..



మాట్లాడుతున్న సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని సబ్‌కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 862 కేసులు పరిష్కారమయ్యాయని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్‌లో పోలీస్‌శాఖ లక్ష్యానికి మించి కేసులు పరిష్కారానికి చొరవ చూపించారని అభినందించారు. సమావేశంలో జూనియర్ సివిల్‌జడ్జి ఎస్‌కె అయేషాసరినా, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, ఏసీపీ ఎ.రఘు, సీఐలు టి.కిరణ్, వెంకటేష్, ఎస్సైలు షాకీర్, ప్రసాద్, బార్ అధ్యక్షులు శ్రీనివాసరావు, న్యాయవాదులు, కక్షీదారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించరా..?



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. శనివారం సత్తుపల్లిలోని ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రిజిస్టర్లు పరిశీలించారు. ఆ సమయంలో ఉద్యోగులు లేకపోవటంతో జిల్లా రవాణాశాఖాధికారి సిద్ధికి ఫోన్ చేసి ఈ కార్యాలయంలోని ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్‌జాదవ్ రెండు రోజులుగా రావటం లేదని, సీఎల్ కూడా మార్కు చేయలేదని పేర్కొన్నారు. వాహనదారులు కార్యాలయం గేటుబయట ఎండలో నిల్చోబెడుతున్నారని, ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్‌లో అసంతృప్తి వ్యక్తం చేస్తూ నోట్ రాశారు. అదేవిధంగా జగన్నాధపురంలోని పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఎన్టీఆర్‌నగర్‌లో సింగరేణి ఆర్వో ప్లాంట్‌తో పాటుగా జేవీఆర్ పార్కు ఎదురుగా నూతనంగా నిర్మించిన షాపింగ్‌కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలం దృష్ట్యా ఇటీవల మంజూరు చేసిన రూ.కోటి ఎస్‌డీఎఫ్ నిధులు, రూ.3.92 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో తాగునీటి బోర్లు, మోటార్లు, పైపులైన్ల విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపధికన చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ఏఈ సురేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, డీఈఈ స్వరూపరాణి, నర్సింహారావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కమల్‌పాషా, అప్పారావు, సింగరేణి వేల్ఫేర్ ఆఫీసర్ దేవదాసు పాల్గొన్నారు.

దాసరి కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాసరి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని ఆదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా ఐదుశాతం జనాభా ఉన్న దాసరి కులస్తుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయికి దాసరి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శనివారం సత్తుపల్లిలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాంబాబు, శ్రీను, సుబ్బారావు, నర్సింహారావు, రాములు, శోభనాద్రి, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



చింతకాని: విద్యార్థికి పరీక్ష సామగ్రి అందిస్తున్న పరిశ పుల్లయ్య



ఏన్కూరు: విద్యార్థులకు జామెట్రీ బాక్సులు అందిస్తున్న దృశ్యం

తల్లాడ/ చింతకాని/ ముదిగొండ/ఏన్కూరు: మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సతీమణి, చింతకానిలోని పందిళ్లపల్లి పాఠశాలలోని విద్యార్థులకు ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య పరీక్ష సామగ్రి అందించారు. అదే విధంగా ముదిగొండ మండలంలోని బాణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 2005-06 టెన్త్ పూర్వవిద్యార్థులు తోటి మిత్రుడు తమ్మారపు వేణు జ్ఞాపకార్థం పరీక్ష సామగ్రి అందించారు. ఏన్కూరులోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖమ్మం కృష్ణవేణి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. మరియు చిలుకూరి బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, రబ్బర్లు, స్కేల్స్‌ను అందించారు. 2023-24 బెస్ట్ స్టూడేంట్‌గా ఎంపికైన రామిశెట్టి పల్లవికి షీల్డ్‌ను అందించారు. ఈ కార్యక్రమాలల్లో హెచ్‌ఎంలు వెంకట్రామిరెడ్డి, సైదయ్య, రాంమోహన్‌రావు, ఉపాధ్యాయులు మాదినేని నరసింహారావు, ఎం.ఎం.రాజకుమారి, పులి వెంకటేశ్వర్లు, స్వరాజ్యలక్ష్మి, మురళీకృష్ణ, సుశీల, కవిత, శ్రీనివాసరావు, శివనారాయణ, సరిత, సుజాత, మహేశ్వర్, షర్మిలకుమారి, మహిముదాబేగం, జ్యోతి, నాగమణి, హరిత, కవిత, నాగేంద్రమ్మ, కృష్ణప్రసాద్, కిషోర్, కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు వీడ్కోలు..

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాలలో హెచ్‌ఎం జ్యోతిశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిధిగా ఎస్‌జేకేఎం కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు అందించారు. కండ్రిక పాఠశాల హెచ్‌ఎం సూరానేని హనుమంతరావు పది విద్యార్థులకు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నర్సింహారావు, బాలకృష్ణ, ప్రభాకర్‌రావు, కృష్ణార్జునరాజు, లక్ష్మి, రవి, తదితరులు పాల్గొన్నారు.

కవిత అరెస్టుకు నిరసనగా ర్యాలీ

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం మండలంలోని వలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కవితను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే సోదాల పేరుతో కవితను అరెస్ట్ చేయటం అక్రమమని విమర్శించారు. రాజకీయాలలో కక్ష సాధింపు ధోరణి సరైంది కాదన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



సత్తుపల్లి: నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు



బోనకల్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు



పెనుబల్లిలో..